వేసవి శిబిరం.. భవితకు సోపానం

- విద్యార్థుల ప్రగతికి ప్రభుత్వం పటిష్ట చర్యలు
- శిబిరాలను పరిశీలించిన ప్రత్యేక అధికారి
- బాలబాలికలకు పౌష్టికాహారం అందజేత



విద్యార్థులకు ఆహారం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఖోఖోలో ప్రతిభ చాటుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి చక్రవర్తి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పాఠశాల ఎదురుగా గల మైదానంలో వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. బాలబాలికలు పాల్గొంటున్నారు. జూన్ 5 వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పాఠశాల పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నీకాయిట్లలో 80 మంది విద్యార్థులకు శిక్షణ పొందుతున్నారన్నారు.

శిక్షణ శిబిరాన్ని పరిశీలించిన ప్రత్యేక అధికారి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రత్యేక అధికారి చక్రవర్తి పరిశీలించారు. జాతీయ స్థాయిలో ఖోఖోలో పాల్గొన్న విద్యార్థినులను ప్రత్యేక అధికారి చక్రవర్తికి పీడీ ఇస్మాయిల్ పరిచయం చేశారు.

సచివాలయ ఏఎస్‌ఎంలకు క్లాస్..

వేసవి శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ప్రత్యేక అధికారి చక్రవర్తి సచివాలయాల ఏఎస్‌ఎంలకు క్లాస్ తీసుకున్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్స్‌ను ఏర్పాటు చేసుకోకపోవడంతో వారిపై అసహనం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ప్రత్యేక పౌష్టికాహారం అందజేత..

శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులకు శిక్షణ అనంతరం ఉడకబెట్టిన గుడ్లు, మిల్క్ షేక్, బిస్కెట్ ప్యాకెట్లు అందజేస్తున్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకట రమణ, బోనెల జోసెఫ్ చేతుల మీదుగా విద్యార్థులకు ఆహారం అందజేశారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి హైస్కూల్ మైదానంలో జగనన్న వేసవి శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు పాల్గొని వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. పిల్లలు వారికి నచ్చిన క్రీడల్లో శిక్షణ తీసుకుని భవిష్యత్తులో తల్లిదండ్రులు, గురువులు, గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు స్పెషల్ ఆఫీసర్ ప్రకాష్, సచివాలయ సెక్రటరీ మనీంద్ర, పార్వతి, గంగరాజు, స్థానిక నాయకులు బలిరెడ్డి నాగేశ్వరరావు, కోమటి రమాదేవి, వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, వర్రే రాజు, కోనేటి పారిపల్లి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో భాగంగా ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



విద్యార్థులకు పుస్తక పఠనం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు పుస్తక పఠనం, చదరంగం పోటీలు

పెదగంట్యాడ: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. గురువారం గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, చదరంగం పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా బంగారుమాంబ పండగ



శ్రీ బంగారుమాంబ అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు గ్రామ దేవత శ్రీ బంగారుమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంధ్రెడ్డి రామునాయుడు, బోగాది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

షీలానగర్‌లో ఘనంగా శ్రీ కుంచమాంబ అమ్మవారి పండగ

69వ వార్డు షీలానగర్‌లో కొలువైన శ్రీ కుంచమాంబ అమ్మవారి పండగ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం వేకువ జామునే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించారు. ప్రసాద వితరణ గావించారు.

వేగంగా హెల్త్ సర్వే



కొండయ్యవలసలో హెల్త్ సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస వార్డు సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది హెల్త్ సర్వే నిర్వహిస్తున్నారు. ఆరోగ్య విభాగం సారథ్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రతీ కుటుంబం ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని గుర్తింపు నంబర్ ఇవ్వనున్నట్లు సిబ్బంది తెలిపారు. ప్రతీ కుటుంబంలో ఆరోగ్య స్థితిగతులు, ఎవరు ఏ మందులు వాడుతున్నారో తెలుసుకుంటామన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

10న ధ్వజస్తంభ అధిరోహణ



శ్రీరామ ఆచార్యులకు పుష్పాలు అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ శ్రీ రామాలయంలో జూన్ 10వ తేదీన ధ్వజస్తంభ అధిరోహణ నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ పండితులు రాజేటి శ్రీరామ అచార్యులతో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు కలిసి చర్చించారు. జూన్ 8వ తేదీ సాయంత్రం నుంచి 10వ తేదీ వరకు 21 మంది దంపతులతో శాంతి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జూన్ 10న రామాలయం ఎదురుగా ధ్వజస్తంభం అధిరోహణ జరపనున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం అన్నసమారాధన, ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విరాళాలు అందజేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దేముడు మృతి



సిమ్మ దేముడు (ఫైల్)

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలేనికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిమ్మ దేముడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బుధవారం అగనంపూడి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వంతెన వద్ద డివైడర్‌ను ఢీకొని కింద పడిపోవడంతో తలకు గాయమైంది. మెదడులో రక్తస్రావమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున ఆయన మృతి చెందారు. 79, 85 వార్డుల్లోని లంకెలపాలెం, అగనంపూడి ప్రాంత పార్టీ నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు.

లెర్నింగ్ మెటీరియల్ పంపిణీ

గాజువాక: వడ్లపూడి భవిత కేంద్రంలో శిక్షణ పొందుతున్న దివ్యాంగ చిన్నారులకు హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ (ఎన్‌ఐఎంహెచ్) ప్రతినిధులు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ కిట్లను ప్రదానం చేశారు. సంస్థ ప్రతినిధులు జగన్, అనిల్ ఆధ్వర్యంలో 233 కిట్లను ఇక్కడి కేంద్రానికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు బి.శ్రీనివాస్, పైడప్ప నాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

మొక్కలు పంపిణీ



గ్రామస్తులకు పండ్ల మొక్కలు అందజేస్తున్న కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి

పెదగంట్యాడ: ఎన్టీపీసీ అందజేసిన సుమారు 1000 కొబ్బరి, జామ, మామిడి, గులాబ్‌జామ్, సపోటా, నేరేడు వంటి పలు పండ్ల రకాల మొక్కలను కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి చేతుల మీదుగా గురువారం పిట్టవానిపాలెం, దాసరిపేట, చిన్నపాలెం గ్రామాల స్థానికులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోవిరి షణ్ముఖ, శివకుమార్, ఇస్మాయిల్, డి.తాతారావు, చిట్టిబాబు, సంజీవరెడ్డి, అప్పలరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఓహెచ్‌టీలో పడి కుక్క మృతి

- సకాలంలో గుర్తించిన సిబ్బంది
- నీటిని వాడొద్దంటూ మైకులో ప్రచారం

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డు డ్రైవర్స్ కాలనీ ప్రాంతంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ (ఓహెచ్‌టీ)లో పడి ఓ కుక్క మృతి చెందింది. తొలుత గమనించని సిబ్బంది నీటిని యథావిధిగా సరఫరా చేశారు. నీటి నుంచి దుర్వాసన వస్తోందని స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో వెంటనే ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించారు. అందులో కుక్క చనిపోయి ఉండటాన్ని గమనించి తొలగించారు. ఆ ట్యాంకు నుంచి నీటి సరఫరా జరిగిన ప్రతి కాలనీలో వీధివీధికి వెళ్లి నీటిని వాడవద్దంటూ మైకులో ప్రచారం చేశారు. వెంటనే ఆ నీటిని పారబోయాలని సూచించారు. అనంతరం ఓహెచ్‌టీని మూడుసార్లు శుభ్రం చేశారు. శుక్రవారం నుంచి నీటి సరఫరా యథావిధిగా సాగుతుందని, ఇంకా అనుమానం ఉంటే ఆ నీటిని ఇంటి అవసరాలకు ఉపయోగించుకోవాలని నీటి సరఫరా విభాగం అధికారులు తెలిపారు. ఆ తరువాత రోజు నుంచి వచ్చే నీటిని పూర్తిస్థాయిలో వాడుకోవచ్చన్నారు.

బస్టాప్‌లో ఆటో డ్రైవర్ మృతి



మృతుని భార్య, కుమారుడు, తల్లిదండ్రులు



బస్టాప్‌లో మృతి చెందిన ఆటో డ్రైవర్ బొరయ్య

అగనంపూడి: అగనంపూడికి చెందిన ఆటో డ్రైవర్ అకస్మాత్తుగా మృతి చెందాడు. దువ్వాడ పోలీస్టేషన్ పరిధిలోని అగనంపూడి నిర్వాసితకాలనీ డొంకాడకు చెందిన చంద్రపాటి బొరయ్య (43) ఉదయం ఆటో తీసుకొచ్చి ఆటో స్టాండ్ వద్ద ఉంచాడు. బస్టాప్ వద్ద కూర్చుని అలాగే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ప్రయాణికులు, ఆటోస్టాండ్ డ్రైవర్లు బొరయ్యలో కదలిక లేకపోవడంతో పరిశీలించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందినట్లు నిర్ధారించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు యశ్వంత్ ఉన్నారు. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ.. కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

పారిశుధ్యంపై అలసత్వం వద్దు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- 52వ వార్డులో విస్తృత పర్యటన



నేతాజీనగర్ రహదారి గురించి కమిషనర్‌కు వివరిస్తున్న స్థానికులు



కరాసా వద్ద గెడ్డను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ జియ్యాని

గోపాలపట్నం: పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వద్దని సచివాలయ కార్యదర్శులకు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ సూచించారు. 52వ వార్డులో గురువారం ఉదయం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణతో కలిసి ఆయన పర్యటించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో కమిషనర్‌కు శ్రీధర్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి రహదారులు, గ్రీన్ బెల్ట్‌ను పరిశీలించారు. గ్రీన్ బెల్ట్‌లో అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్‌ను చూసి చాలా బాగుందని కొనియాడారు. ప్రధాన కాలువలు, ఇంజినీరింగ్ పనులతోపాటు దీర్ఘకాలంగా ఉన్న పాస్‌పోర్ట్ కార్యాలయం నుంచి కరాసాకు వెళ్లే ఎయిర్‌పోర్ట్ స్థలాల్లోని రహదారిని పరిశీలించారు. నేతాజీనగర్ రోడ్డును 80 అడుగులుగా అభివృద్ధి చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ను స్థానికులు కోరారు. ఇక్కడి నుంచి కరాసా, గౌరీనగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య పనులపై అలసత్వం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రధాన గెడ్డల్లో పూడికలు తీసే పనులు చేపట్టాలని ఆదేశించారు. డీఈ ఏడుకొండలు, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎ.రాజేష్ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జ్ఞానం గొప్ప సంపద



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: జ్ఞానం గొప్ప సంపదని, దాన్ని ఎవరూ దొంగిలించలేరని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం జిల్లా అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు చిత్రలేఖనం, జీకే, ఇంగ్లిష్ బోధన, తెలుగు పదాలు, కాగితాలతో వివిధ ఆకృతుల తయారీ తదితర వాటిలో వారం రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. గురువారం జనరల్ నాలెడ్జికి సంబంధించిన పలు అంశాలను చిన్నారులకు ఆమె వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, రచయిత సత్తిరాజు, కార్మిక నాయకుడు బి.సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, పిడుగులతో వర్షం

గాజువాక: భారీ ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం పడడంతో గాజువాక వాసులు ఆందోళన చెందారు. గురువారం ఉదయం నుంచి భారీ ఉష్ణోగ్రత నమోదు కాగా, సాయంత్రం 4 గంటల సమయంలో వాతావరణం మారిపోయింది. ఒకపక్క ఉరుములు, మరోపక్క పిడుగుల శబ్దాలు, భారీ గాలులతో కూడిన వర్షం కురవడంతో జనం ఇబ్బంది పడ్డారు. గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వడ్లపూడి ప్రాంతంలో పలు చెట్లు కూలడంతో రాత్రి ఏడున్నర గంటల వరకు సరఫరా పునరుద్ధరణ కాలేదు.

అలరించిన మేడే సాంస్కృతిక మేళా



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్కిట్



రమేష్ మాస్టర్ బృందం నృత్య ప్రదర్శన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక మేళా ప్రేక్షకులను అలరించింది. మే డే ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మేళా నాడు వర్షం కారణంగా రద్దు కాగా గురువారం ఏర్పాటు చేశారు. సినీ దర్శకుడు సత్తిరెడ్డి, పల్సర్ బైక్ ఝాన్సీ, రమేష్ మాస్టర్ విశాఖ ఉక్కును కొనేది ఎవడు, అమ్మేది ఎవడు అనే పాటకు చేసిన ప్రదర్శన ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. మేళాలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు తమదైన శైలిలో ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను ఉత్తేజపరిచారు. అంతకు ముందు జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు ముఖ్య అతిథిగా మేళాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధికి కళలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్మిక వర్గ చైతన్యాన్ని మరింత పెంచేందుకు కళలు చాలా ఉపయోగపడతాయన్నారు. ఉక్కు కార్మికుల చైతన్యాన్ని మరింత పదును పెట్టేందుకు ఈ మేళాను ఏర్పాటు చేశామన్నారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, అధ్యక్షుడు వై.టి. దాస్, ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి కళాకారులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. రామారావు, బి. అప్పారావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల పున:ప్రారంభానికి ఏర్పాట్లు



తుంగ్లాంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామ దేవతలు శ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల నూతన ఆలయాల ప్రారంభం అంగరంగ వైభవంగా జరపనున్నట్లు వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి తెలిపారు. గురువారం తుంగ్లాంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు అమ్మవార్ల ఆలయాల పునః ప్రారంభం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 29వ తేదీన శ్రీ శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు డాక్టర్ బూచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రిచే దేవీ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారన్నారు. 30వ తేదీన అమ్మవార్లకు హోమాలు, విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 31వ తేదీన శ్రీ లలితా పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి, శ్రీ శక్తి పీఠాధీశ్వరి శ్రీ రమ్యానంద భారతి చేతుల మీదుగా అమ్మవార్ల ఆలయాల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లి అప్పలరెడ్డి, నామాన సింహాచలం, కొల్లి కుంచారావు, అచ్చిబాబు, మజ్జి రాజు, రాము, కాకి రామిరెడ్డి, పెట్ల అర్జున, పెట్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టే యత్నమే ప్రైవేటీకరణ



833వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని, ఉక్కు ఉత్పత్తిని నిలిపేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 833వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రైవేటీకరణను ఆపాలని, సంస్థను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేను కలిసిన బీఎంఎస్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ బీఎంఎస్ నాయకులు కోరారు. గురువారం నాయకులు స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండేను కలిసి కార్మికుల సమస్యల గురించి చర్చించారు. కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాల్సిన అవసరం గురించి వివరించారు. ప్లాంట్ అభివృద్ధికి బీఎంఎస్ పూర్తి సహకారం అందిస్తుందని, అదే విధంగా ప్రభుత్వ సహకారం కోసం కేంద్ర మంత్రులను కలిసి తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ జీఎంలు బినయ్‌ప్రసాద్, కె. సంజీవరావు, బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్. నాయుడు, జిల్లా కార్యదర్శి రాందాస్ నరేంద్ర, కొమ్మినేని శ్రీనివాస్, హరీష్ వర్మ, శేషగిరిరావు, కె. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసుల నమోదు తగదు



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న కార్మికులు

సీతమ్మధార : కాంట్రాక్ట్ వర్కర్స్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ గంగారావు డిమాండ్ చేశారు. వెంకటరెడ్డిపై అసత్య ఆరోపణలు, అక్రమ బైండోవర్‌కు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గంగారాం మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్లు, పార్కులు, వెటర్నరీ, వాటర్ సప్లై తదితర విభాగల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పోరాడుతుంటే జీవీఎంసీ అధికారులు, పోలీసులు ఎన్నడూ లేని విధంగా అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు, బైండోవర్ కేసులు పెట్టడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్,పి.వెంకటరెడ్డి, టి.నూకరాజు, యు.రాజు, ఎంవీ ప్రసాద్‌రావు, వి.కృష్ణారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

డాబాగార్డెన్స్: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో స్పాట్ బిల్లింగ్ పనులు చేస్తున్న మీటర్ రీడర్ల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. శివారెడ్డి, యూనియన్ ప్రతినిధి జీఎస్ రాజేశ్వరరావు ఏపీఈపీడీసీఎల్ సీఎండీని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐదు జిల్లాల మీటర్ రీడర్ల సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. పనిదినాల కుదింపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని, పీస్ రేటు రద్దు చేసి నెలవారీ వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మీటర్ రీడర్స్ పీస్‌రేటును సర్వీస్‌కు రూ.9.50 పైగా నిర్ణయించాలన్నారు. డోర్ లాక్, నిల్ సర్వీసులకు శాశ్వత పరిష్కారం చూపేవరకు జీతాల్లో కోతలు విధించరాదని, అలాగే ఇప్పటి వరకు జీతాల్లో అన్యాయంగా విధించిన కోతలు వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని, స్మార్ట్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, జీఎస్ రాజేశ్వరరావు, కేఎస్‌డీఎస్‌కే రెడ్డి, రామకృష్ణ, కుమారస్వామి, శ్రీనివాస్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.